# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ డైవింగ్ సపోర్ట్ నౌక 'నిస్టార్' ని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఈ రోజు విశాఖపట్నంలో జాతికి అంకితం చేస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో ఈ రోజు జరిగే గ్రీన్ హైడ్రోజన్ సదస్సు లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**

3. **ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీఒక్కరూ కృషిచేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు.**

4. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటిస్తారు.**

5. **ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా ఆంజనేయస్వామి అన్నారు.**

==========================

భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ డైవింగ్ సపోర్ట్ నౌక 'నిస్టార్' ని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఈ రోజు విశాఖపట్నంలో జాతికి అంకితం చేస్తారు. ఈ కార్యక్రమంలో నావికాదళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఇతర నావికా దళ అధికారులు పాల్గొంటారు. హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, విశాఖపట్నం తయారుచేసిన నిస్టార్ నౌక ఆత్మనిర్భర్ భారత్ కు ఒక చిహ్నంగా నిలవనుంది. ఈ నౌకను 120కు పైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల భాగస్వామ్యంతో 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేశారని నావికా దళ అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో ఈ రోజు గ్రీన్ హైడ్రోజన్ సదస్సు-2025 జరగనుంది. అమరావతిలోని ఒక ప్రయివేట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఈ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. అలాగే కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో పాటు నీతిఆయోగ్ సభ్యులు వీకే సారస్వత్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాల నుంచి పలువురు నిపుణులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

---------------------------

సమీకృత ప్రణాళికలతో పారిశ్రామిక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో

ముఖ్యమంత్రి అధ్యక్షతన 8వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు–ఎస్ఐపీబీ సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశంలో 39 వేల 473 కోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 22 ప్రాజెక్టుల ద్వారా 30 వేల 899 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు సమీపంలో రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీఒక్కరూ కృషిచేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని కొహెడలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాల్లో భాగంగా గవర్నర్ నిన్న స్టీల్ బ్యాంక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణహిత ఉత్పత్తులను ఉపయోగించాలని కోరారు.పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని గవర్నర్ తెలుపుతూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అంతరిక్షం విజ్ఞానంపై సమగ్ర అవగాహణ కల్పించేందుకు "ఒకరోజు అంతరిక్ష విద్య" శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ నిర్వహిస్తోంది. తొలి విడతలో భాగంగా ఈరోజు నుంచి ఆగష్టు 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల, సత్యసాయి, కడప, అన్నమయ్య, గుంటూరు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలలో "స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్స్" ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా బనగానపల్లెలో "ఒకరోజు అంతరిక్ష విద్య శిబిరాన్ని' రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా కొల్లాపూర్ మండలం జటుప్రోలులో మదనగోపాలస్వామి వారి ఆలయాన్ని సందర్శిస్తారు. తర్వాత జటుప్రోలులో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని . స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా ఆంజనేయస్వామి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో నిర్వహించిన సుపరిపాలన లో తొలిఅడుగు కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హారీష్ మాథూర్ తో కలసి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్ 32 సెకన్లు

---------------------------

పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రిడ్ స్థిరత్వంను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు.. ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం ప్రభుత్వ మద్దతు అవసరమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆహార పదార్థాలు, మందుల నాణ్యతపై నిఘా పెంచాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ –ఐపిఎం నకిలీ మందుల సరఫరాను నియంత్రించే డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్–డిసిఎ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని మంత్రి సూచించారు. కృత్రిమ మేథ, మెషీన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికత ఆధారంగా డిజిటల్ వైద్య సేవల్ని విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

---------------------------

ఉపాధి పనులపై నిర్వహించే సామాజిక తనిఖీల నుంచి గ్రామసభల వరకు అన్ని వివరాలూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీలపై గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన రెండు రోజుల దక్షిణాది రాష్ట్రాల ముగింపు సదస్సులో ఆయన నిన్న ప్రసంగించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించే సభలను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ లోని వాతావరణ పరిస్థితుల గురించి వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ...

వాయిస్ 23 సెకన్లు

మరో వైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

=====================